మరి నాలుగడుగులు ఆచేలో నేఅడ్డంగా తూర్పుకు వేశాను. రోడ్డు తగిలింది. అడ్డదారిని చేరుకొన్న జనంకూడా ఆరోడ్డునే నడుస్తున్నారు. "అయ్యగారూ! తమరు రావడం అలస్యమైందేమండీ?" అని నన్ను వారు అడిగారు. నేనున్నూ జరిగిందంతా చెప్పాను.

"అసలా కుప్పనూర్చాక ఈ జనుంకోశాక మరెవ్వరూ చుట్టుప్రక్కల వుండరు. ఈపొద్దు కాబట్టి మీకు యజమానిగారు కనిపించారు. ఆయనరారు ఆయన పాలేళ్లురారు ఇలా! దారేపోయే వాళ్ళు ఒక్కొక్క ఇటుకే ఆ నూతిగోడను ఊడబెరికి ఆ మామిడి కాయలు కొట్టుకుంటూ వుంటారు. ఇదీ దాని వృత్తాంతం" అని చెప్పారు.

"గడ్డివెంటి?" అన్నాను. గడ్డివెంటి అన్నదికూడా ప్రజలు పన్నిన పన్నాగమే. పాలేళ్ళంతా పోగై ఒక గడ్డివెంటిచుట్టి వ్రేలాడగట్టారు ఆ మామిడి చెట్టుని. ఈపొద్దు కుప్పనూర్చుడైపోతే రేపు అగ్గిపుల్లతో దాన్ని అంటించిపారేస్తారు" అన్నారు. "నీళ్లలాగే వుంటాయి, కాయలలాగే వుంటాయి?" అన్నాను. "నీళ్ళూ కాయలూ అన్నమాటేం? నూతిలోకి చూచేవాళ్ల నీడలుకూడా అలాగే వుంటాయి. అవి ఎన్నటికి తగులడవు" అన్నారు.

మేమున్నూ రోడ్డుచివరి అవలియూరు చేరుకున్నాము.

... ... ... ... ...

## "రమ్జాం గోడ"

"ఇటు 'రంమ్జాం'గోడ అటు 'జైలు'
గోడ దాటి గోదావరి రాదని కాబోలు
రెండుగోడల మధ్యను "హట్‌మెంటు పురం" నిర్మించారు"

అన్నాను ఓపొద్దు సంచారంచేస్తూ కూడావున్న స్నేహితునితో. స్నేహితుడు తదైకధ్యానంగా "హట్‌మెంటు పురం" యొక్క

కుటీరాల్ని, పుట్టుకిటునుండి వట్టి గడ్డికప్పులదాకా పరికిస్తూ, నామాట వినిపించుకోనివాడిలా కొంతసేపు ప్రవర్తించాడు. ఆ కొంతసేపు నేను ఏదో కూనరాగం తీసుకుంటూ, నామానాన్ని నేను చుట్టూ చూడసాగాను ఇతని ప్రేమేయం ఏమిటన్నట్టు!

ఆ కుసింత వ్యవధి ఎటువంటి కాలం అంటే అటువంటి కాలం అనుకోండి! మంచి శరత్కాలం మంచుపడే దీర్ఘనిశీధిని యొక్క తెల్లవారుఝాం! ఏదో తోచక యిద్దరం బయలుదేరేం ఉషఃకాల విహారంగా! ఏదో తోచక అనేకన్న ఆ వెన్నెలనేచూచి అంటే ప్రకృతికి ఒప్పనేమో!

తెల్లగా పడమటినుంచి చంద్రుడు చల్లగా ప్రసరిస్తూవున్నాడింకా తన శుభ్రజ్యోత్స్న! క్రుంకవచ్చు అతగాడు మరో గంట గంటన్నరలో! పూరాబింబంగా తోచలే మళ్లీ చూస్తే! ఒక కళో రెండుకళలో అప్పుడే దేవతలు ఫలహారం చేసినట్లే క్షీణత చూపేడు. కాని చిక్కగానేవుంది కాంతి! కనసొంపుగానేవుంది. మరిన్నీ "హట్‌మెంట్లు" అన్నిటికీ కొత్తగా వెల్లవేసి, వినోదరూపం ఇచ్చారేమో, సౌధాలు కాకపోయినా సౌధామ్యాలంత సౌఖ్యంగా కానిపించాయి మాకు సుధాకరతేజంలో!

మా మూకీభావంలో మళ్ళా ఎప్పుడు సమాప్తమైందంటే మిత్రుడు మాట్లాడినప్పుడే! "ఇది హట్‌మెంటుపురం"లా లేదు. 'నెహ్రూనగర'మేనోయి" అన్నాడు నా స్నేహితుడు. "బల్ల కట్టి వున్నంతసేపూ కాదనడాని కెవరితరం? అయితే ఇలాగే ఆర్యాపురానికి 'లిస్టర్ పేట' అని పేరున్నట్లు హిస్టరీ చెప్పేని, ఇప్పుడెవడైనా ఆ పేరెట్టి పిలుస్తూ వున్నాడా? అందరూ ఆర్యాపురమనే అంటున్నారు!" అన్నాను. "అవితే 'హిస్టరియా'కు పూర్వం ఇన్నీసుపేట నేమనేవారు?" విని అడిగాడు నేస్తు డెటకారంగా!

"అది స్వతహాగా ప్లీడర్లు అంతావుండే పేటకాబట్టి ఇంగ్లండులో "ఇన్సు" అన్నది బారిష్టర్లను తయారుచేసేది

కాబట్టి, ఆ బ్యారిష్టర్లలాంటి ప్లీడర్లే వీళ్ళు కాబట్టి, ఆ పేట ఇన్నీసు పేట అనేరు" అన్నాను అతి సీరియస్‌గా.

"కాదు. 'ఇన్' అంటే సత్రవు, నాళంవారి సత్రవు చేరువ నుండబట్టి ఆ పేరొచ్చింది" అన్నాడు మిత్రుడు నిఘంటువుపెట్టి నన్నొంటిపాటున కొట్టినట్టు. ఇలా పేర్లమీద పేటలమీద కొంత వరకు మేమిద్దరం తర్జన భర్జనంచేసుకు మళ్లీ మౌనందాల్చాం! ఈ మధ్యమధ్య మా మౌనానిక్కారణం, చుట్టూవున్న ప్రకృతి యొక్క పరమాత్మస్వరూపమే అని నమ్మండి!

"హట్ మెంట్లు" నిర్మాణం అయినా ఇంకా పదిరెట్లు వల్లమాల్నంత ఖాళీస్థలంవుంది. కాపురం వుండేవాళ్ళుంటే అక్కడ కాళీఘట్ తెచ్చి యిక్కడ పెట్టొచ్చు. అదంతా ఎర్ర మట్టి ఇసుక కలిసిన మెరకప్రదేశం. సూర్యోదయం అయితే ఆ జేగురుమట్టి పూసుకు ఉదయం కసరత్తుచేసి ఆంజనేయుల్నొ మందేహుల్నొ జయించి, ఆ వెంటనే విజయవంతంగా వెలువడుతూ వున్నాడా ఓ గుండాభాయి అని అనుకోవలసిందే! అంత నిర్మానుష్యంగాను, నిర్మలంగాను, నిశ్చింతగాను వున్న జాగా!

ఎక్కడైనా పెద్ద పుట్ట కనిపిస్తే అందులో ఏ వాల్మీకి మహా మునో ఇంకా వున్నాడనేటంత పురాతనంగా కనిపిస్తుంది. మరి ఆ చుట్టుప్రక్కల చింతలు, తాళ్లు, రేగుపొదలు, జీడిమామిడి మొక్కలు, వేపలు ఇవన్నీకూడా శతవృద్ధులవల్ల పోల్చబడవలసిందే! ఏనాడు నాటబడ్డాయో? "కోట"కు ముందు అనాది నుంచీ వెలిసినవంటారు. మనుష్యులువేస్తే లేచినవి కావుట! కడచిన కల్పాంత ప్రళయమప్పుడు గింజపెటిల్లి పల్లటిల్లి బయలుదేరిన వనాంతరాలై యుండాలి తదాదీ అవన్నీ సందులేనివై, స్వాధీనం కానివై, బలిసి, కలగలసి నిలిచి వుండాలి. భగవాన్ ఆ సర్వేశ్వరునియొక్క అవ్యాజ కరుణా కటాక్ష వీక్షణాలవల్ల!

అలా ఒక నిమేషం దేవుణ్ణిస్మరిస్తూ, ఒక నిమేషం ప్రకృతిని స్మరిస్తూ నడిచాం కొంతమేఱ. అంతా ఇంకా రాత్రిలాగే కనిపించింది. "అరెరె! మన మేమైనా అనుకొన్నవేళకు చాలా ముందుగా మేలుకొన్నామా ?" అని నాలుక్కరచుకున్నవాళ్లమై మళ్లేం! నిజమే కూడాను! ఒక్కొక్కప్పుడు వెన్నెలరాత్రుళ్లు అర్ధరాత్రే కూస్తాయి కాకులు కావుకావుమని, కోళ్లు కొక్కొరోకోమని!

వెనక్కు మళ్లీ మళ్ళడంలో స్ఫుటతరంగా 'జైలు' గోడ, గోడలోపలి ఉరిస్తంభాలు కానవచ్చాయి మాకు ఉత్తరపుదెస. మరి దక్షిణపుదెస "రంజాం" గోడయొక్క సిమారు రెండుగజాల యెత్తు, మూడుగజాల పొడుగు, అరగజం మందం, పైనీతట్టు ఆతట్టు రెండు గుమ్మటాలు పొడుగుపాటివి రెండు పొట్టివి, ఇలా సమస్తం సర్వాంగసుందరంగా అతి గుట్టుగా పుట్టగొడుగుల్తో లేచివున్నట్టుంది.

ఈ జైలుగోడదాటి ఆ రంజాం గోడకేసి నడుస్తూవున్న ఒకానొక వ్యక్తియొక్క నీడ, నీడతోపాటు వాడు, వాడు అనగా ఆ నీడకు హక్కుదారుడు, అసలు దారుడు అయిన మగవాడు కాపట్టాడు. అతణ్ని అడ్డుతగల లేకపోయినాం! ఎవరవు? అని అడగలేక పోయినాం! కాని అరసి ఆశ్చర్యపోయాం! ఆశ్చర్యపోయి ఆపాళంగా నిశ్చేష్టులంగాక, సర్వసాధారణులకు మల్లే! ధైర్యంగా అనుసరించాం! అనుసరించినకొద్దీ చురుకుగా అంజలు వేసినవాడై ఆవ్యక్తి వెనక్కు చూడకుండానే "రంజాం" గోడ ముందు మోకరించాడు. ఎప్పుడైతే మోకరించాడో మేమల్లంత దూరాన్ని అతగాడికి తెలియకుండా ఆగిపోయాం!

అతడు తన తెల్లనిగడ్డాన్ని పిదప చలిగాల్లో, తుదివెన్నెల్లో రెల్లుపూతలా అల్లల్లాడించుకుంటూ నమాజుచేసేడు ఆ రంజాం గోడ కెదురుగా! అలా అతగాడు నమాజు చేస్తూనే వున్నాడు. జైలుగోడమీదనుండి జోడుగుళ్ళు బారుతుపాకీ ఢాంమని పేలింది!

రెండుగుళ్లు, రెండుగుళ్లు మా బుజాలు రాసుకుంటూ పోయాయా అన్నంత "విజ్జు" మంటూ దాటి ఆ నమాజు చేస్తూవున్న మనిషి యొక్క వీపున తగిలాయి. అతగాడు రిమ్మతిరిగి పడ్డట్టు పడిపోయి నాడు మాటలేకుండా! మరి వాటం అంతా తారుమారైంది. ఏమై పోయినాయో ఆవరకూ కనబరచిన చురుకూ ఎవరికీ దొరకని దుముకూ దూరామూ?

జైలుగోడ మీదనుండి తుపాకులు పేల్చిన జవానులు ఇద్దరూ ఉడుంపట్టున దిగారో ఏమో, ఈవలతట్టుకు అనగా, మాతట్టుకుదిగి పడివున్న ముసీలి ఖైదీవంకకు నడుస్తూవచ్చారు. బ్రతికివున్నాడో చనిపోయినవాడో అని చూడ్డానికి లాగుంది.

మేము వాళ్ళను వాళ్ళ తుపాకులను చూస్తూచూస్తూ, మెల్లిగా "రంజాం" గోడ ఆవలితట్టుకు అనగా రెండోవెంపుకు తప్పుకున్నాం—గోడకు రెండువైపు లుంటాయిగా?

ఉండుండి పొట్టిగుమ్మటాల సందునున్న ఒంటి దిమ్మ మీదుగా తలలెత్తి కనుగొనేవాళ్ళం! గోడావలితట్టు మరి మాటే గాని దృశ్యం కానరాలేదు. మాటన్నా 'దుడా' 'దాడీ' జలజలా రాలిపోతున్న మాత్రంగా ధ్వనించింది. "జైలుగోడ దాటడం నేర్చానుగాని, యీ రంజాంగోడ దాటడం నేర్వలేకపోయాను! "ఇక్కడ చచ్చానుబే! ఇక్కడ చచ్చానుబే!" అన్నట్టయింది.

అత డనుకొనే స్వగతం జగత్తుకు వినబడకుండా జైలు జవానులు జోళ్ళ సమేతంగా కాళ్ళు చప్పుడు గావించుకుంటూ "జైలుగోడ దూకినవాడు ఈ పొట్టిగోడ దూకలేకపోయాడా? మతం వాని నల్లాచేసింది! అల్లా బిసిమిల్లా!" అనుకుంటూ వానిని మోసుకుపోయేరు!

నేను నా స్నేహితుడు తలలెత్తి ఈ తట్టునుండి ఆతట్టు చూపులాన్చేసరికి అంతా ఆ మహాదృశ్యం హారతి కర్పూరం హరించిపోయినట్లు హరించిపోయింది.

రోడ్డుమీదకువచ్చి తెల్లారి పునరావృత్తంగా పైవృత్తాంతం మేం స్నేహితులం బిగ్గరగా చెప్పుకొంటూంటే, బాటసార్లు అనేరు "అంత విడ్డూరం జరిగి ఫిరంగులే పేలివుంటే, ఆకాడున్న గుడిసెల్లో వాళ్ళింకా తమ అరచేతులు గుండెలమీద పెట్టుకు వెచ్చెచ్చగా నిదరోతూ వుండగలరా? మీదంతా కవనం కరణం కవిలె!" అన్నారు. "ఆ పురంలో కాపురంవున్న వాళ్ళంవరూ సొంత యిళ్లమధ్య పడిపోయిన బాపతువారీవాళ్లు. మీకేంతెలుసు? సామా నిప్పుడే జేరమోసుకు బడలి నిద్రించేరు!" అన్నాను. బాటసారులు నవ్వేరు. నా మిత్రుడుకూడా ఎప్పుడూ నవ్వనివాడు నవ్వేడు.

కాని క్షీణచంద్రు డొక్కడూ మాత్రం నాతో ఈడూ జోడూగా వుండి. తాను వెలవెలబోతూవున్నా నామాట నమ్మాడు. ఎంచేతా? ఇస్లామ్ చిహ్నం చంద్రవంక కాబట్టి!

జైలు నాలుగుగోడలు మధ్య? ఏమతంలేదు। ఏ కులం లేదు! అక్కడ ఏలేది అందకార మొక్కటే। సూర్యభగవానుడా ఉండడు! చుక్కలు మొదట్నే కనబడవు! అవన్నీ యీవలి స్వేచ్ఛావాతావరణంలోనివే!

ఈలా ఈలా మళ్ళీ మౌనంలో పడ్డాం! నేనూ నా మిత్రుడూను, ఈమాటు బాట, బాటసార్లుకూడా పరిహరింపబడ్డారు!

సమాప్తం.

రాజేశ్వరి ప్రెస్, రాజమండ్రి.